క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని దుబ్బపేట గ్రామానికి చెందిన సమ్మయ్య అనారోగ్యంతో హైదబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆర్థిక సాయం కోసం బాధిత కుటుంబ సభ్యులు బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధును సంప్రదించగా రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు మధు కుమారుడు పుట్ట శ్రీహర్ష ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి బుధవారం అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



చిట్యాల: మండలంలోని భీష్మనగర్, కొత్తపేట, చల్లగరిగ 3వ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా సంక్షేమశాఖ అధికారి శైలజ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లల హాజరు శాతం, కేంద్రాల శుభ్రత, గర్భిణుల, బాలింతల హాజరు, మెనూ ప్రకారం వంట చేయడం, రికార్డును పరిశీలించారు. అలాగే తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి ఆహారము, ఆరోగ్యము, వ్యక్తిగత శుభ్రతలపై, తల్లిపాల ప్రాముఖ్యత అనుబంధ పోషకాహారము గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య అవసరం

కాళేశ్వరం: పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో అవసరమని అంగన్‌వాడీ టీచర్ మచ్చ శైలజ అన్నారు. బుధవారం పలుగుల-1వ అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ పిల్లలకు శారీరకంగా, మానసికంగా, చదువులో రాణించడానికి పూర్వ ప్రాథమిక విద్య ముఖ్యమైనదని అన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

టేకుమట్ల: మండలంలోని రామకృష్ణపూర్ (టి) గ్రామంలో సర్పంచ్ గునిగంటి మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులకు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా సీనియర్ నాయకులు కత్తి సంపగౌడ్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ అధ్యక్షుడు ఇండ్ల మల్లేష్, తలగంపల రాయమల్లు, యూత్ నాయకులు సుభాష్ గౌడ్, అనిల్, బూర రాజు పాల్గొన్నారు

నేడు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు

మహదేవపూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు(గురువారం) జిల్లా కోర్టు జడ్జి ఆధ్వర్యంలో అగ్రి లీగల్ ఎయిడ్‌క్లినిక్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి, డివిజన్ సహాయక వ్యవసాయ సంచాలకుడు హాజరు కానున్నారు.

వాగులో పడి ఒకరి మృతి

మొగుళ్లపల్లి: ప్రమాదవశాత్తు చలివాగులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా మొగుళ్లపల్లి మండలం అంకుషాపూర్ గ్రామంలోని శివారు చలివాగు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం మల్యాల గ్రామానికి చెందిన ఉడుత సమ్మయ్య(65) అనే వ్యక్తి(గొర్ల కాపరి) కొన్ని రోజులుగా గొర్రెలను మేపుతూ జిల్లా పరిధిలో సంచరిస్తున్నారు. తిరిగి ఇంటికి బయల్దేరిన క్రమంలో మంగళవారం సాయంత్రం అంకుషాపూర్ చలివాగు ప్రాంతానికి చేరుకున్నారు. గొర్రెలను వాగు దాటించిన అనంతరం వాగులో స్నానం చేసి వస్తానని సహచరులతో చెప్పి వెళ్లి గల్లంతయ్యాడు. దీంతో చలివాగులో వెతకగా బుధవారం శవమై కనిపించాడు. మృతుడి భార్య కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నూనే అశోక్‌కు చెందిన పాడిగేదె ప్రభుత్వ పాఠశాల సమీపంలో మేతమేస్తుండగా కిందపడిన విద్యుత్ తీగకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ సుమారుగా రూ.50వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం పరిహారం అందించి రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



మహాముత్తారంలో నేలకొరిగిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ సతీష్



గండికామారంలో నేలకొరిగిన వరిపొలం వద్ద కూర్చున్న రైతు

మహాముత్తారం: మండలంలోని కనుకునూర్, నర్సింగాపూర్, నల్లగుంటమీనాజీపేట, కిష్టాపూర్, గండికామారం, చింతలపల్లి, ములుగుపల్లి, పోలారం తదితర గ్రామాల్లో రైతులు 8వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి వివిధ గ్రామాల్లో యాసంగిలో సాగుచేసిన వరిపొలాలు పంట చేతికచ్చే సమయంలో నేలమట్ట మయ్యాయి. దీంతో చేతికచ్చిన పంట నేలపాలైయ్యాయని ఆయా గ్రామాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా మండల కేంద్రంలో దెబ్బతిన్న పంటనలు మండల వ్యవసాయ అధికారి సతీష్ బుధవారం పరిశీలించారు. అలాగే గండికామారంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి పుష్పలత పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన ఈదురుగాలుల వర్షానికి సుమారు 60ఎకరాల వరి నేలమట్టమయినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచన వేశారు.

కాటారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షంతో అన్నదాతలు ఆగమగమయ్యారు. పలు గ్రామాల్లో రైతులు కల్లాలు, కొనుగోలు కేంద్రాల ప్రతిపాదిత స్థలంలో ఆర బోసిన ధాన్యం కొంత మేర తడిసిపోయింది.



కాటారం: నేలవాలిన వరి

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి



క్రీడాకారులతో ఆర్‌సీ రాజ్యలక్ష్మి, ఎంపీపీ సమ్మయ్య

కాటారం: ప్రత్యేక శిబిరాల ద్వారా క్రీడాకారులు క్రీడా నైపుణ్యతను పెంపొందించుకోవాలని గురుకులం ఆర్‌సీ రాజ్యలక్ష్మి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాల ఆవరణలో కొనసాగుతున్న సమ్మర్ హ్యాండ్ బాల్ కోచింగ్ శిబిరాన్ని బుధవారం ఆర్‌సీ, ఎంపీపీ పరిశీలించారు. శిక్షణ కొనసాగుతున్న తీరు, క్యాంపునకు హాజరవుతున్న క్రీడాకారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులకు ఉన్నత శిక్షణ అందించాలని నిర్వాహకులకు సూచించారు. క్రీడాకారులు క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని వారు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రాజేందర్, కోచింగ్ క్యాంపు ఇన్‌చార్జ్ వెంకటేశం, వైస్ ప్రిన్సిపాల్ సిరిసిల్ల శ్రీనివాస్, వార్డెన్ రాకేశ్, కోచ్‌లు ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, సుమన్, సతీశ్, పీడీ మంథెన శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

షర్మిల దీక్షకు మద్దతు



దీక్షలో కూర్చున్న కిషన్

భూపాలపల్లి అర్బన్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని హైదరాబాద్‌లోని ఇందిరపార్కు వద్ద నిర్వహించిన దీక్షకు జిల్లా పార్టీ నాయకులు మద్దతు తెలిపినట్లు జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ తెలిపారు. నాయకులు కృష్ణ, సదయ్య, మధుకర్, రమేష్, సురేష్ పాల్గొన్నట్లు వెల్లడించారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

కాటారం: అకాల వర్షాలకు రైతులు అతలాకుతలం అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని బీజేపీ జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరిధాన్యం రైతుల చేతికి వచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా జాప్యం చేస్తుందన్నారు. అకాల వర్షాలకు వరి ధాన్యం తడిసిపోవడంతో మిర్చి, మామిడి నేలరాలి రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఓ పక్క రైతులు కల్లాల వద్ద కన్నీరుకారుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పార్టీ సమావేశాలు, మంత్రులు విందుల పేరిట ఎంజాయ్ చేస్తున్నారని ఆరోపించారు. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయడంతో పాటు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య

కాటారం: మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండలంలోని రేగులగూడెం, ధన్వాడలో కల్లాల్లో రైతులు ఆరబోసుకున్న ధాన్యాన్ని ఎంపీపీ పంతకాని బుధవారం పరిశీలించి మాట్లాడారు. మండలంలో ధాన్యం రైతుల చేతికి వచ్చి 20 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం శోచనీయం అన్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆరోపించారు. రైతులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని దిగాలుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ వెంట సర్పంచ్ అంగజాల అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ రావు, వంశవర్ధన్, అశోక్, కొంరయ్య, సాయి, నారాయణ, సాగర్, రైతులు ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

భూపాలపల్లి రూరల్: గీత కార్మికుడికి గాయాలైన సంఘటన భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ గ్రామానికి చెందిన గట్టు భిక్షపతి బుధవారం వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకుజారి కింద పడిపోయాడు. తీవ్ర గాయలు కావడంతో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన భిక్షపతిని ప్రభుత్వం ఆదుకోవాలని కమలాపూర్‌గౌడ సంఘం నాయకులు కోరారు.

అక్రమ వసూళ్లను అరికట్టాలి

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో జరుగుతున్న అక్రమ వసూళ్లను అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 75 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయగా అందులో దళితులకు 38, బీసీలకు 37 మంజూరయినట్లు తెలిపారు. దీంతో ఒక్కొక్క లబ్ధిదారు నుంచి అదనంగా రూ.90,000వేలను అక్రమంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ వాసుళ్లకు బీజం పోస్తున్న కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం అటువైపు కూడా చూడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గజనాల రవీందర్, మండల నాయకులు కుసుంబా సుందర్, లబ్ధిదారులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్‌గౌడ్

ఇద్దరు దొంగల అరెస్టు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు దొంగలను పట్టుకున్నట్లు స్థానిక సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై ప్రశాంత్ సిబ్బంది కలిసి సంయుక్తంగా జంగేడు రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల వద్ద కట్టరు, కటింగ్ ప్లేయర్, ఇనుప రాడ్‌తో కలిగి అనుమానాస్పదంగా ఉండగా వారిని విచారించినట్లు తెలిపారు. హన్మాన్‌నగర్‌కాలనీకి చెందిన ఉరుసు దిలీప్‌కుమార్, మరో మైనర్ బాలుడు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని వివిధ కాలనీల్లో ఐదు దొంగతనం కేసులలో ఇళ్లలో దొంగతనాలు చేసి బంగారం, డబ్బులు దొంగిలించినట్లు ఒప్పుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద ఉన్న రూ.70వేలు రికవరీ చేయడం జరిగిందన్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

బురదమయంగా సైడ్‌బర్మ్



గుంతలు ఏర్పడ్డ సైడ్‌బర్మ్



ప్రమాదకరంగా సైడ్‌బర్మ్

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి-రాఘవరెడ్డిపేట ప్రధాన రోడ్డును కాంట్రాక్టర్ ఇటీవల నిర్మించారు. కానీ రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్ పోయాల్సిన కాంట్రాక్టర్ డంపింగ్ యార్డులోని మట్టి, రోడ్డుకు ఇరువైపులా పోసి చేతులు దులుపుకున్నారు. దీంతో మూడు రోజులుగా కురుసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా పోసిన మట్టి పూర్తిగా బురదమయంగా మారింది. అసలే సింగల్ రోడ్డు, ఇక ఎదురుగా ఒక వాహనం వస్తే మరో వాహనం పూర్తిగా రోడ్డు దిగాల్సిందే. చిన్న పాటి వానలకే సైడ్‌బర్మ్ ఇంతలా బురమయం అయితే వర్షాకాలంలో వాహన దారులు పరిస్థితి మరీ దారుణమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల కిత్రం క్వాలిటీ కంట్రోల్, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు నాణ్యతను పరిశీలించారు, కానీ సైడ్‌బర్మ్‌పై స్పందించకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొక్కలను జాగ్రత్తగా పెంచాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: నర్సరీల్లో మొక్కల పెంపకం జాగ్రత్తగా చేపట్టాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని మేడిపల్లి, కొత్తపల్లి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను బుధవారం ఎంపీడీఓ పరిశీలించారు. మొక్కల పెంపకం, నిర్వాహణ, ఏ ఏ రకాల మొక్కలు పెంచుతున్నారని ఆరా తీశారు. మొలకెత్తని బ్యాగుల్లో లోకల్ సీడ్, పూల, పండ్ల మొక్కల కొమ్మలు నాటాలని ఆదేశించారు. కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. కోడిగుడ్లు, పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని సూచాంచారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

చిన్న వయస్సులో పెద్ద కష్టం

- తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులు
- తమ్ముడి చదువు కోసం కూలీలుగా మారిన అన్నా, అక్క
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



తాత్కాలికంగా వేసుకున్న గుదారంలో చిన్నారులు

దీన గాథ

కాటారం: జీవితాన్ని విధి ఎప్పుడు ఎలా మారుస్తుందో తెలియదు. చిన్న పెద్దా తేడా లేకుండా జీవితాలను చిన్నాభిన్నం చేస్తుంది. అల్లారుముద్దుగా బాల్యాన్ని గడపాల్సిన చిన్నారులను విధి వక్రీకరించడంతో అష్ట కష్టాలు పడుతున్నారు. తోడు నీడగా నిలిచి ఆలన పాలనా చూసుకోవాల్సిన అమ్మానాన్న తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో అనాథలుగా మారి కడుపు నిప్పుకోవడం కోసం కాయకష్టం చేస్తున్నారు. తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులు తమ్ముడి చదువు కోసం తమ చదువును త్యాగం చేసి కూలీ పనులకు వెళ్తున్న దీనగాథ కాటారం మండలం మద్దులపల్లిలో చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్తే..

గ్రామానికి చెందిన పిట్టల బాపు, అనంత దంపతులకు రాజ్‌కుమార్(16), రష్మిత(15), రంజిత్ (12) ముగ్గురు పిల్లలు. దంపతులు ఇద్దరు కూలీ పని చేస్తూ ముగ్గురు పిల్లలను చదివిస్తూ ఉండేవారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎనిమిదేళ్ల కిందట తల్లి అనంత ఆత్మహత్య చేసుకొంది. అనంత ఆత్మహత్యతో చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారగా గుండె ధైర్యంతో తండ్రి బాపు వారికి ఏలోటు రాకుండా చూసుకుంటూ వచ్చాడు. ఆ కుటుంబాన్ని విధి కక్ష్యతో వెంటాడినట్లు మూడేళ్ల క్రితం బాపు అనారోగ్యం పాలయ్యాడు. క్రమంగా అనారోగ్యం క్షీణించి మంచానికే పరిమితం కావడంతో కుటుంబ పోషణ దుర్భరంగా మారిపోయింది. దీంతో అప్పటికే స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు రాజ్‌కుమార్, మేడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న రష్మిత చదువులు మానేసి కుటుంబ పోషణ భుజాలపై వేసుకున్నారు. అటు మంచం పట్టిన తండ్రి, ఇటు చదువుకుంటున్న తమ్ముడి కోసం కూలీలుగా మారారు. ఏదో ఒకలా కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్తుండగా విధి మరో సారి కన్నెర చేసింది. నెల రోజుల క్రితం తండ్రి బాపును సైతం బలితీసుకొంది. దీంతో చిన్నారులు పూర్తిగా అనాథలుగా మారిపోయారు. ఉన్న కాస్త ఇల్లు శిథిలావస్థకు చేరడంతో ముగ్గురు చిన్నారులు రోడ్డు పక్కన ఓ గుడారం వేసుకొని జీవనం సాగిస్తున్నారు. రాజ్‌కుమార్, రష్మిత కూలీ పనులకు వెళ్తూ వారి తమ్ముడు రంజిత్ కాటారం గిరిజన పాఠశాలలో 5వ తరగతి చదివిస్తున్నారు. ఏ తోడు నీడ లేని ఈ అనాథ చిన్నారులు ఆపన్న హస్తం కోసం ఎదిరి చూస్తున్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి ఆదుకోవాలని ఆ చిన్నారులు వేడుకుంటున్నారు.

సాయం చేసే వారు ఉంటే
96408 63237 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు



నిధుల మంజూరు పత్రాన్ని చూపిస్తున్న జక్కు రాకేశ్

కాటారం: మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా యువత ఎదురి చూస్తున్న మినీ స్టేడియం ఏర్పాటు కళ సాకారం అవనుంది. మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం గత కొంత కాలంగా కొంత మంది యువత ఏకమై ముందుకు నడిచారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సాకారంతో తిమ్మన్నకుంట శిఖం భూమిలో తాత్కాలికంగా స్టేడియం ఏర్పాటుకు అంకురార్పణ చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. యువత అకాంక్షను నెరవేర్చాలనే లక్ష్యంతో జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి ముందుడి నడిచారు. జిల్లా క్రీడా అభివృద్ధి శాఖ నిధుల నుంచి మినీ స్టేడియం ఏర్పాటు కోసం రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించారు. అట్టి నిధులకు సంబంధించిన మంజూరు కాపీని బుధవారం బీఆర్‌ఎస్ యూత్ జిల్లా నాయకులు జక్కు రాకేశ్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. మినీ స్టేడియం ఏర్పాటుకు నిధుల కృషి చేసిన శ్రీహర్షిణి, రాకేశ్‌కు కాటారం యువత, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: దళిత శక్తి ప్రోగ్రాం(డీఎస్‌పీ) వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజ్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు బహిరంగ సభ ఈ నెల 30న హైదరాబాద్ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు కొత్తూరు రవీందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముగింపు సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు జిల్లా డీఎస్‌పీ నాయకులతోపాటు కార్యకర్తలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ప్రజాస్వామ్య వాదులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీ ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, నాయకులు అశోక్, శ్రీనివాస్ వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారులకు డీడీలు అందించాలి

టేకుమట్ల (రేగొండ): రెండో వితడ గొర్రెల కోసం లబ్ధిదారులు వాటాను డీడీలు తీసీ అధికారులకు అందించాలని రేగొండ ఎంపీపీ శ్రీమతి పున్నం లక్ష్మీ రవి లబ్ధిదారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీపీ పున్నం మాట్లాడుతూ.. వాటాను రూ.43750 చెల్లించిన లబ్ధిదారులకు క్రమంగా సీరియల్ ప్రకారం సబ్సిడీ గొర్రెలు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన సదస్సులో మండల ప్రత్యేక అధికారి సామ్యూల్, ఎంపీడీఓ సురేందర్, మండల పశు వైద్యురాలు మైత్రి, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వేణు చందర్, ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌లు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైన్‌పాక గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు గిద్దె ముత్తారం గ్రామానికి చెందిన భూక్య రాజు, బాయి రమణ కుమార్, అందుకుతండా గ్రామానికి చెందిన హాట్కార్ రాకేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది సిద్దార్థ, లాల్ సింగ్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన దుబాసి శ్రీకాంత్‌కు రూ.13,000, బోగే దుర్గకు రూ.15,000 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. యాదగిరిరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు పంతకానీ వెంకట్‌రాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సుమన్, వార్డు సభ్యులు తోట స్వరూప రమేష్, రాధ శ్రీనివాస్ పాల్గొన్నారు.